# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రజాదర్బార్‌లో ఈరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' పేరుతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.**

**3. గోదావరి పుష్కరాల నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.**

**2. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 134వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం.**

==========================

గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల నుంచి అర్జీలు ఈరోజు స్వీకరించారు. అనంతరం ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సాయంత్రం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఆర్డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు తక్షణ ఫిర్యాదు నమోదు విధానాన్ని అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సైబర్ నేరాలపై నిన్న నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బాధితులు సహాయ కేంద్రానికి సమాచారం ఇచ్చిన వెంటనే ఫిర్యాదు నమోదు చేసి, బ్యాంకులను అప్రమత్తం చేయడం ద్వారా ఖాతాల నుంచి డబ్బు బదిలీ కాకుండా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులే లక్ష్యంగా జరుగుతున్న మోసాలపై అవగాహన పెంచాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు రూపొందిస్తున్న కార్యాచరణను డిజిపి ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ సైబర్ గార్డ్ అనే పేరుతో సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాని ఆయన వెల్లడించారు.

--------------------------

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా, పవిత్రంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' పేరుతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను నిన్న ప్రకటించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో 262 నదీ తీర పంచాయతీలను మురుగు నీటి రహితంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల నుంచి గోదావరిలోకి చేరుతున్న మురుగు నీటిని అరికట్టేందుకు మ్యాజిక్ డ్రెయిన్లు, సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని ప్లాంట్లలో శుద్ధి చేసి విడుదల చేయాలన్నారు. మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వ్యర్థజలాలు గోదావరిలో కలవకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

---------------------------

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజాహిత పరిపాలన అందిస్తూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది.కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా ప్రజలకు ఎంతో ఆర్థికంగా లబ్ధి చేకూరిందని తూర్పు గోదావరి జిల్లా, నరేంద్రపురం గ్రామంలో నివాసం ఉండే శివ నాగరాజు తెలియజేస్తూ..

వాయిస్..20 సెకన్లు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పీఎం కిసాన్ పథకం తనకు ఎంతో ఉపయోగపడిందని నరేంద్రపురం గ్రామానికి చెందిన రైతు విష్ణువు వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

గోదావరి పుష్కరాల నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడారు. స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం బాధ్యతగా అమలు చేస్తోందని చెప్పారు. బస్సులు మారినా స్త్రీశక్తి పథకంలో మార్పులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. 2029 నాటికి 3 వేల సీఎన్జీ, ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలియజేస్తూ..

వాయిస్..20 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో ఇప్పటివరకు 114 సంస్థలకు ఒక వెయ్యి 269 ఎకరాల భూములు కేటాయించినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. వీటిలో 70 ప్రభుత్వ, 44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయని చెప్పారు. భూముల కేటాయింపుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం ద్రుశ్య మాధ్యమ విధానంలో నిన్న నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యా రాణి హాజరయ్యారు. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...30.. సెకన్లు

---------------------------

పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం ప్రజలందరి బాధ్యతని విజయనగరం జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి ఎస్.రాంసుందర్ రెడ్డి అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా స్థానిక కణపాక వద్ద ఆయన ఈరోజు పనులను పరిశీలించారు. కాలువల్లో పూడిక తొలగించే ప్రక్రియలో ఆయన సబ్బందితో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశుభ్రమైన నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లాలో చెరువుల పరిరక్షణ, మురుగునీటి కాలువల ఆధునీకరణ, ప్రజా ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈరోజు పార్వతీపురంలోని శివాలయం చెరువు వద్ద "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పనులను పరిశీలించిన ఆయన, ప్రజల కోసం నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాకింగ్ ట్రాక్‌ను సందర్శించారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026 తుది దశకు చేరుకుంది. రేపు రాత్రి అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ తుది పోటీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు పోటీ పడనున్నాయి. నిన్న జరిగిన క్వాలిఫైయర్ – 2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు పై గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇప్పటి వరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అయిదు సార్లు ఫైనల్ కు చేరగా, గుజరాత్ టైటాన్స్ మూడు సార్లు ఫైనల్‌కు చేరింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దాని ఆనుకుని ఉన్న తమిళనాడు తీరంపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈరోజు, రేపు రాయలసీమలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులను పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు. మొదట ప్రకటించిన ప్రణాళిక ప్రకారం జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా.. దీన్ని ఆరో తేదీకి మార్పు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

====================